ప్రజాశక్తి

శనివారం 28 సెప్టెంబర్ 2024 | 5 | శ్రీ సత్యసాయి

రేపు 'ఏచూరి' సంస్మరణ సభ

ప్రజాశక్తి-హిందూపురం

మార్క్సిస్టు మేధావి, సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని చౌడేశ్వరి కాలోని, పెనుకొండ రోడ్డులో ఉన్నా సాయిరాం ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్మరణ సభకు సంబందించిన వివరాలను వెల్లడించారు. ఈ సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు ముఖ్యవక్తగా హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయ శక్తులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు హాజరు కానున్నారు. పార్టీలకు అతీతంగా సంస్మరణ సభకు ప్రజలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాతస్టాకు.. కొత్తధర..!

- దిగుమతి సుంకం పెంపుతో భారీగా పెరిగిన నూనె ధరలు
- అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని వాణిజ్య శాఖ అధికారులు

వంటల్లో రుచి కావాలంటే నూనె ఉండాల్సిందే. అయితే ఇప్పుడా వంట నూనె ధరల మంట సలసలా కాగుతోంది. ఒక్కసారిగా లీటరుపై రూ. 15 పైగానే పెరగడంతో సామాన్యుడి వంటింట బడ్జెట్ గాడి తప్పింది. అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకొని నూనెల పై దిగుమతి సుంకాన్ని పెంచటంతో గతవారం నుంచి ధరల్లో పెరుగుదల పరుగులు తీసింది. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ స్పందించి దుకాణాలను తనఖీలు చేసి, స్టాకు రిజిస్టర్‌ను పరిశీలన చేసి, ఎంత స్టాకు ఉంది. వ్యాపారులు అమ్ముతున్న వాటికి బిల్లులు ఇస్తున్నారా.? లేదా అని చూడాల్సుంది. అయితే ఆ అధికారులు నిద్ర మత్తులో నుంచి బయటకు రావడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

వంటనూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఆ వేడిలో సామాన్యుడు విలవిలాడుతున్నాడు. గత వారం నుంచి వంటనూనె లీటరు ధర రూ.15ల వరకు పెరిగింది. పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె, సోయానూనె ధరలు పెరిగాయి. వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఆ మరుక్షణమే రిటైల్ వినియోగదారులు లీటరుకు రూ.15 పెంచేశారు. దిగుమతి సుంకానికి అదనంగా 5శాతం స్టాండెడ్ సెస్, 10శాతం అగ్రికల్చర్ సెస్ యాడ్ అవుతుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ. 130 వరకు పెరిగింది. చిల్లర దుకాణాల్లో ఇంకో ఐదు రూపాయలు ఎక్కువగానే అమ్ముతున్నారు. పామాయిల్ ధర రూ.95 నుంచి110 రూపాయలకు పెరిగింది. వేరుశనగ రూ.145 నుంచి రూ.154 పెరిగింది. దీపారాధన ఆయిల్ రూ.108 నుంచి రూ.121కి పెరిగింది. సన్‌ఫ్లవర్ 15 కేజీలడబ్బా రూ.1,750 నుంచి రూ.2వేలకు ఎగబాకింది. పామాయిల్ డబ్బా రూ.1,520 నుంచి 1,720 రూపాయలకు పెరిగింది. రైస్‌బ్రాన్ ఆయిల్ రూ.120 నుంచి రూ. 130కి పెరిగింది. ఒక్కసారిగా ధర పెరగడంతో వినియోగదారులు అల్లాడి పోతున్నారు. దిగుమతి సుంకం పెంచడంతో దళారులు రంగంలోకి దిగారు. ఉన్న ఆయిల్‌ను గోడౌన్లలో నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ఇంకా ధరలు పెంచేందుకు పన్నా గాలు పన్నుతున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరలతో సామాన్యుల వంటింట బడ్జెట్ తలకిందులైంది. ఇప్పుడు వంటనూనెల పై దిగుమతి సుంకం పెంచడంతో సామాన్యులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. నూనె దుకాణాలను వెంటనే తనిఖీలు చేసి, పాత స్టాకు ఎంత ఉంది, పాత స్టాకు ఉన్నంత వరకు పాత ధరలకే విక్రయాలు జరిగే విధంగా చూడాల్సిన వాణిజ్య శాఖ అధికారులు కార్యాలయం నుంచి బయటకు రావాడం లేదు. దీంతో వ్యాపారులు ఆడిందే ఆట...పాడిందే పాటగా తయారైంది. వారు అధికధరలకు నూనె విక్రయిస్తు నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి, నూనె దుకాణాలపై దాడులు నిర్వహించి ధరలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా ప్రజలపై రూ. 10 కోట్ల భారం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 50 లక్షల జనాభా, సుమారు 15 లక్షల కుటుంబాలు ఉన్నాయి. సగటున జిల్లాలో నెలకు 70 లక్షల లీటర్ల నూనె వాడకం ఉంటుందని అంచనా. ఒక్కసారిగా లీటర్‌పై కనిష్టంగా 15 రూపాయలు పెరిగినందున, నెలకు రూ. 10.5 కోట్లు అదనపు భారాన్ని జిల్లా ప్రజలు మోయాల్సి వస్తోంది. దసరా దీపావళి వంటి ముఖ్య పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరుగుతుందని, ఆ మేరకు మోయలేని భారం పడుతుందని సామాన్యులు వాపోతున్నారు.

పండుగల వేళ భయపెడుతున్న ధరలు : పండుగల సమయంలో వంటనూనె ధరలు పెరగడంతో వినియోగదారులు భయపడుతున్నారు. వినాయకచవితి పండుగ మొదలుకుని వచ్చే ఏడాది సంక్రాంతి వరకు చాలా పండుగలున్నాయి. వచ్చే నెలలో దసరా, ఆపై దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నూనె ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంటనూనె ధరలు పెరగడం వల్ల ఇతర ఆహార పదార్థాల ధరలు పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించి ప్రజలపై భారాలు వేయకుండా చూడాలని, బ్లాక్ మార్కెటింగ్ ద్వారా గోడౌన్లలో దాచిన వంట నూనెలను బయటకు తీసుకొస్తే రేట్లు పెరుగుదలను నివారించవచ్చని వినియోగదారులు కోరుతున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు : వంటనూనెల ధరలు ఒకసారి పెరగడంతో ఉన్న నిలువలను దాచేసిన వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఏ దుకాణానికి వెళ్లినా వంటెనూనె లేదనే మాటే వినిపిస్తోంది. కొన్ని రోజులు ఈ కృత్రిమ కొరత సృష్టించి ఆ తర్వాత పెరిగిన ధరకు అమ్ముకోవచ్చన్నది కొందరి స్వార్థ వ్యాపారుల ఎత్తుగడ.

కల్తీకి అవకాశం : మార్కెట్లో వంట నూనె ధరలు పెరగడంతో అక్రమార్కులు జూలు విదిల్చే అవకాశాలు ఉన్నాయి. విడి విక్రయాల పేరుతో కల్తీ వ్యాపారానికి తెరలేపే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కన ఉండే అల్పాహారశాలలు, చిన్న హోటళ్లు, మాంసాహార దుకాణాల వారు ఎక్కువగా విడిగా వంట నూనె కొనుగోలు చేస్తుంటారు. సమీప పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు ఈ తరహా నూనె రవాణా అయ్యే అవకాశాలు ఉన్నాయి. పట్టణంతో పాటు పల్లెల్లో కిరాణా దుకాణాల్లోనూ ఈ విడి విక్రయాలు జరుగుతున్నాయి. ఈ అమ్మకాల్లో కల్తీలకు అవకాశం ఉంటుంది.

ఓ షాపులో అమ్మడానికి సిద్ధంగా ఉంచిన పాత స్టాకు

పాత స్టాకుకు పెరిగిన ధరల పట్టికను ప్రదర్శిస్తున్న దృశ్యం

ధరల పెరుగుదలతో సతమతం

ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగాయి. నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నాం. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికే బతుకు దెరువు కష్టంగా ఉంది. మరలా వంటనూనె ధర పెరగడం సామాన్యుడిపై పెనుభారమే. నూనె ధరలు పెరగటం వలన మిగిలిన ఆహార వస్తువుల ధరలన్నీ పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో సామాన్యులు బతికేది ఎలా.? వెంటనే వంటనూనె ధరలు తగ్గించాలి.

ఆజాద్,
వినియోగదారుడు, హిందూపురం

అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదు

ఎంఆర్‌పి ధరల కన్నా అధిక ధరలకు ఎవరు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. కేంద్రం వంట నూనెపై దిగుమతి సుంకం పెంచడంతో చాలామంది వ్యాపారులు వారి వద్ద ఉన్న పాత స్టాకును కొత్త స్టాకుగా చూపిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై దాడులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పట్టణంలో 5 కేసులు నమోదు చేశాం.

శంకర్ ,
తూనికల కొలతల ఇన్స్‌పెక్టర్

కలకలం రేపిన యువకుడి ఆత్మహత్య

సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ లభ్యం
పోలీసుల వేధింపులే కారణమని వెల్లడి
సొంత గ్రామంలోని పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య
అప్పటి సిఐలపై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం యర్రదొడ్డి గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ అనే యువకుడి ఆత్మహత్య కదిరిలో కలకలం రేపింది. తన మృతికి పోలీసుల వేధింపులు, ప్రేమించిన యవతులు కారణమని సెల్ఫీవిడియో, సూసైట్‌నోట్ రాసి మృతిచెందాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబందించి మృతుని కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు...కదిరి రూరల్ మండలం యర్రదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ, మునెమ్మ దంపతుల కుమారుడైన ఉదయ్ కుమార్ మూడు సంవత్సరాల కిందట తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమెతో కలసి సొంతప్రాంతానికి వచ్చాడు. అయితే ఆ యువతి కుటుంబ సభ్యులు అప్పట్లో తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు . అక్కడి పోలీసులు ద్వారా అప్పట్లో కదిరి రూరల్ సీఐగా పనిచేస్తున్న మధు ఉదయ్‌కుమార్ గురించి ఆరా తీశారు. అతని కుటుంబ సభ్యులను పిలిపించి దుర్భాషలాడాడు. ఉదయ్ కుమార్‌ను పట్టుకొని అక్కడి పోలీసులకు అప్పచెప్పారు. దీంతో తెలంగాణ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి ఉదయ్‌కుమార్‌ను రిమాండ్‌కు పంపారు. మూడు నెలల తర్వాత బెయిల్ పై వచ్చిన ఉదయ్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా పోలీసులు తీవ్రంగా కొట్టడంతో అతని చెవి వినిపించకుండా పోయింది. తన కుటుంబసభ్యులను అవమానపర్చడం, తనను హింసించడంపై ఉదయ్‌కుమార్ అనంతపురం కోర్టులో పోలీసులకు వ్యతిరేకంగా ప్రయివేటు కేసు వేశాడు. దీంతో పోలీసులు తిరిగి ఉదయ్‌కుమార్‌పైనా, అతని కుటుంబసభ్యులపైనా ఒత్తిడి తీసుకురావటం ప్రారంభించారు. కేసు ఉపసంహరించుకోవాలని రూరల్ సిఐ తమ్మిశెట్టి మధు తరచూ వారిని వేధింపులకు గురి చేసేవాడు. దీంతో సిఐ వేధింపులు తాళలేక మూడు సంవత్సరాలుగా కనపడకుండా వెళ్ళిపోయి ఉదయ్‌కుమార్ ఎర్రదొడ్డి గ్రామానికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు కారకులైన అప్పటి సిఐ తమ్మిశెట్టి మధు, తనను ప్రేమించి మోసం చేసిన అమ్మాయిల కుటుంబసభ్యులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ సూసైట్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

ఉదయ్‌కుమార్ ఆత్మహత్యాదృశ్యం

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే : మండలంలోని ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా వారు తమకు జరిగిన అన్యాయాన్ని ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

సిఐలపై కేసు నమోదు : కదిరి మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన యువకుడు ఉదయ్‌కుమార్ ఆత్మహత్యకు ముందు రాసిన సూసైట్ నోట్, సెల్ఫీ విడియో ఆధారంగా మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు. అప్పటి సిఐ మధు,తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సిఐ శ్రీనివాసులు తదితరులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

హజ్ యాత్రికులకు ఆర్థిక సహకారంపై హర్షం

ప్రజాశక్తి-హిందూపురం

హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం మైనారిటీలకు ఆర్థిక సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రకటన చేయడం పట్ల స్థానిక ముస్లిం మైనారిటీలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షఫివుల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ కుమార్, ముస్లిం మత పెద్దలు, టిడిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం పెనుకొండలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో సిఎం చంద్రబాబు 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇప్పటికే అనంతపురంలోని బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన డీఎస్సీ అభ్యర్థులు అనంతపురం వెళ్లి రావాలంటే సమయాభావంతో పాటు ఆర్థిక భారం, తదితర కారణాల నేపథ్యంలో పెనుకొండలో కూడా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

నేడు రొద్దం ఎంజెపి స్కూల్ పనులు ప్రారంభం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన 4 ఎంజెపి హాస్టళ్ల పనుల కోసం రూ. 77.64 కోట్లను సిఎం చంద్రబాబు మంజూరు చేశారని మంత్రి సవిత తెలిపారు. అందులో రొద్దం ఎంజెపి స్కూల్‌లో శనివారం రూ. 20.19 కోట్లతో పనులను ప్రారంభిస్తామన్నారు.

బిసి భవనాల పనులు : రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బిసి భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇది బిసిల ప్రభుత్వమని, వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మున్సిపల్ టీచర్స్ సమస్యలపై దశల వారీ పోరాటంలో భాగంగా శుక్రవారం యుటిఎఫ్ కదిరి మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి భార్గవ అధ్యక్షతన ఎంఇఒలు చెన్నకష్ణ, ఓబుల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. డి.శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో సబ్జెక్టు వారీగా టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఈటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ అర్హులైన ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒగా ఉద్యోగోన్నతులు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జిపిఎఫ్ ఖాతా తెరవాలని, నవంబర్‌లోగా అప్‌గ్రేడ్ పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వైవి. సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు ఆజంబాషా, సునీల్‌కుమార్, యుటిఎఫ్ మహిళా విభాగం నాయకులు అనిత, మానస, ఉష, ప్రత్యూష, కదిరి యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నాగేంద్ర, మల్లి, ఖాజా, సంతోష్, రమణనాయక్, ఖాదర్‌బాషా, జబీవుల్లా, రాజేష్, మధు, వెంకటరామిరెడ్డి, కిషోర్, కిష్టప్ప, వెంగమనాయుడు, గయాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ టి.ఎస్ చేతన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి సాయి ఆరామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పలువురు పట్టణ ప్రముఖులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు పెనుగొండలో ఉన్న కుంభకర్ణ విగ్రహం పునరుద్ధరణ, పెనుగొండ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహ వద్ద లైటింగ్ అండ్ ల్యాండ్ స్కేటింగ్, పెనుగొండలో ప్రవేశ తోరణం నిర్మాణం, లేపాక్షి జటాయువు దీం పార్కుతో పాటు పర్యటక సౌకర్యాలను అందించడం జరిగిందన్నారు. సత్య సాయి జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాల్లో ఉన్నందున కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుండి పర్యాటక సందర్శకులు వస్తూ ఉంటారని భవిష్యత్తులో కూడా జిల్లాలో పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఉన్న పర్యాటక అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకున్న పుట్టపర్తి పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచినదని అంతేగాక మడకశిర ప్రాంతంలో హేమావతి, రత్నగిరి కోట ప్రాంతాలను కలుపుతూ పర్యాటక భవనాన్ని రూ. 1కోటి వ్యయంతో నూతనంగా నిర్మించి ఈ మధ్యకాలంలోనే ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ధర్మవారానికి చెందిన అలా నిలయం మానస నృత్య కళా నిలయం కళాకారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శన, హిందూపురానికి చెందిన శ్రీ లక్ష్మీ ప్రసన్న బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి, జానపద నృత్య ప్రదర్శన, ప్రసిద్ధి చెందిన నిమ్మలకుంట కళాకారుల చే తోలుబొమ్మలాట ప్రదర్శన, రాజంపేటకు చెందిన సుజన్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో తదితర కళా ప్రదర్శన కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా గాండ్లపెంటకు చెందిన గౌతం అనే వ్యక్తికి పర్యాటక పోస్టర్ పర్యాటక పోస్టర్ను డిజైన్ చేసినందుకు ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ద్వారా రూ 10 వేల రూపాయల నగదును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యటక అధికారి జయ కుమార్ బాబు పర్యాటక కౌన్సిల్ సభ్యులు పద్మనాభం, జ్యోతి కేశవ, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ జిల్లా అటవీ శాఖ అధికారి చక్రధర్, జిల్లా పర్యాటక మేనేజర్ ప్రతాపరెడ్డి, శిల్పారామం మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిపిఎస్‌గా అలివేలమ్మ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ పట్టణ ప్రణాళిక విభాగంలో టిపిఎస్‌గా అలివేలమ్మ శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఈమె కళ్యాణదుర్గం నగర పంచాయతీ నుంచి హిందూపురం పురపాలక సంఘానికి బదిలీపై వచ్చారు.

నైపుణ్యం పెంపుపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మీ విజన్ బి... మా మిషన్" లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 పై విద్యార్థులకు అవగాహన సదస్సును ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ని పునర్నిర్మిద్దాం పేరుతో ప్రభుత్వం ఇచ్చిన పన్నెండు అంశాలపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి విద్యార్థులకు వివరించారు. అదే విధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమ ఆధారిత, నైపుణ్య పెంపుదల విద్యపై విద్యార్థులను గ్రూపులుగా విభజించి చర్చా గోష్టి నిర్వహించారు. చారిత్రాత్మక పర్యాటక ప్రదేశాలపై చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఇ. శ్రీధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఎస్ పోగ్రాం అధికారి రంగనాయకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతుకు గురైన ప్యానెల్.. ఆగిన నీటి సరఫరా

ప్రజాశక్తి-హిందూపురం

గొల్లపల్లి నుంచి హిందూపురం పురపాలక సంఘానికి అవుతున్న నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు అవుతున్న నీటి సరఫరాలో భాగంగా మూడు ప్రాంతాలలో పంపింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఇందులో ఎస్ కే డి నగర్ ప్రింటింగ్ స్టేషన్ లో పానెల్ బోర్డు మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా నిలిచిపోయాయన్నారు. మరమ్మత్తు పనులు ఇప్పటికే చేపట్టామని, మరమ్మతు పూర్తి అయిన వెంటనే యధావిధిగా నీటి సరఫరా అవుతుందని చెప్పారు. కలిగిన అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా 'ఫైబర్‌నెట్' గోతులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలో జరుగుతున్న ఫైబర్ నెట్ పనులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని ఆర్. మరవపల్లి గ్రామంలో పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో ఎంపిడిఒ కార్యాలయం, గొరాజుపల్లి క్రాస్ వద్ద గుంతలు తవ్వి వదిలేశారు. దీంతోరాత్రి వేళల్లో గుంతలు కన్పించకపోవటంతో ప్రమాదాలు జరుతున్నాయి.

ఫైబర్ నెట్ ఏర్పాటుకు రోడ్డు పక్కన తీసిన గుంత

మంత్రి సవితకు పూలబోకే ఇస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు

మంత్రిని కలిసిన ఆర్డీవో, డీఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ లు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సూచించారు. మంత్రి సవితను శుక్రవారం నూతన ఆర్డీవో ఆనంద్‌కుమార్, నూతన డీఎస్పీ వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి వారితో మాట్లాడుతూ విధుల పట్ల అలసత్వం వహించవద్దని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలన్నారు. సమస్యలు పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. అలాగే డిప్యూటీ తహశీల్దార్ గిరి, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి మంత్రిని కలిశారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో

పెనుకొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా ఆనంద్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురం తహశీల్దార్‌గా పని చేస్తున్న ఆనంద్‌కుమార్ ఉద్యోగోన్నతి బదిలీపై ఆర్డీవోగా ఇక్కడికి వచ్చారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ

పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో శుక్రవారం పెనుకొండ నూతన డీఎస్పీగా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లాలో సిఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు ఉద్యోగోన్నతి బదిలీపై డీఎస్పీగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్ల శ్రీనివాసులు ఎఎస్పీగా ఉద్యోగోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. నూతన డీఎస్పీకి సిఐ రాఘవన్, పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

పర్యాటక మొబైల్ యాప్ ఆవిష్కరణ

పర్యాటక మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ధీరజ్

పెనుకొండ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పర్యాటక మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్‌ను గోరంట్ల బాలుర జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న గోరంట్ల పట్టణానికి చెందిన గంధం ధీరజ్ రూపొందించాడు. ఈ యాప్‌లో జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలు, వాటి ప్రాముఖ్యత తెలుగు, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో ఉంటాయి. అలాగే ఏ పర్యాటక ప్రాంతం ఎంత దూరంలో ఉందో ఒకే స్క్రీన్‌లో కనిపిస్తాయి. ఆ ప్రాంతానికి రూట్ మ్యాప్ చూపుతుంది. ధీరజ్ రూపొందించిన మరికొన్ని మొబైల్ అప్లికేషన్ల గురించి మంత్రి ధీరజ్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయస్సులోనే ధీరజ్ మొబైల్ అప్లికేషన్లను తయారు చేయడం గొప్ప విషయమని అభినందించారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే చేయూత

ఎమ్మెల్యే తరఫున సాయం అందజేస్తున్న నాయకులు

మడకశిర : రొళ్ల మండలంలో టిడిపి కార్యకర్త నరసింహమూర్తి ద్విచక్ర వాహన ప్రమాదం లో గాయపడి హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అతడికి చికిత్స ఖర్చులకు రూ. 20 వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, కార్యదర్శి జికె.ఈరన్న, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు మూర్తి, జనసేన రమేష్ ఆసుపత్రికి వెళ్లి నరసింహమూర్తికి ఇచ్చి పరామర్శించారు.

పత్తి పంట పరిశీలన

పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు

మడకశిర : మండలంలోని జిల్లేడుగుంట గ్రామంలో ప్రకృతి సేద్యం ద్వారా సాగుచేసిన పత్తి పంటను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు పరిశీలించారు. ప్రకృతి సేద్యం ద్వారా పంట సాగు చేయడం వల్ల మిత్ర పురుగులు అభివృద్ధి చెంది పురుగు మందుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఘన, ద్రవ జీవామృతాలు ఉపయోగించడం వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పత్తితో పాటు అంతర పంటలుగా కంది సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చు అన్నారు. రైతు విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో పంట పండించడం వల్ల ఖర్చు బాగా తగ్గిందని పంట కూడా ఆరోగ్యంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎడిఎ కృష్ణమీనన్, ఏవో తిమ్మప్ప, ఎపిసిఎంఎఫ్ కృష్ణచైతన్య, మాస్టర్ ట్రైనర్ రమేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు

తలుపుల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే కాలేజీ, స్కూల్ సమయంలో కొందరు ఆకతాయిలు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో శుక్రవారం ఎస్ఎంసి ఛైర్మన్ ఎద్దుల రాముడు ఆధ్వర్యంలో ఎస్ఐ కృష్ణా రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆకతాయిలను గుర్తించి వారి ఆగడాల ను అరికట్టాలని కోరారు. అలాగే హెచ్ఎం, ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేశారు. కాలేజీ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థిని తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌ను కోరారు.

'స్వచ్ఛత హి సేవ'పై వ్యాసరచన పోటీలు

నల్లమాడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవపై శుక్రవారం దొన్నికోట జడ్పీ హైస్కూల్లో సర్పంచి అధ్యక్షతన గ్రామ కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే స్వచ్ఛత ఈ సేవపై విద్యార్థులకు అవగాహన కల్పించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పోటీల విజేతలకు గాంధీ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ వెంకటరమణ, హెచ్ఎం గీత, ఉపాధ్యాయ బృందం జయరాంనాయక్, భయ్యారెడ్డి, టిడిపి నాయకులు వైసి.గంగులప్ప, పెద్దప్పనాయుడు, నాగరాజు నాయుడు, బిజెపి గంగులప్ప, కిష్ట, శివ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. దోమల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమం లో సామజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రైతుల బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలి

ప్రజాశక్తి-నల్లచెరువు

నల్లచెరువులో తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవక పంటలు పండక రైతులు నష్టపోయారని, కావున రైతులు బ్యాంకుల్లో తీసుకున్న అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని సిపిఎం, రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందచేశారు. జిల్లా రైతు సంఘం సభ్యులు తిరుమలకొండ శ్రీరాములు మాట్లాడుతూ తక్షణమే జిల్లా వ్యాప్తంగా 32 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, రైతు సాయం రూ. 20 వేలు ఇవ్వాలని, ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన రైతులకు పంటల బీమా ఇవ్వాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, ప్రతి రైతుకు రూ. 2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలన్నారు. రైతుల వ్యవసాయ బోరు బావులకు స్మార్ట్ మీటర్లు వద్దని, జిఓ-22 రద్దు చేయాలన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారు లైన రైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని పలు గ్రామాల రైతులు, కౌలు రైతుల సమస్యలపై సిపిఎం, జిల్లా రైతు సంఘం నాయకుడు జంగాలపల్లి పెద్దన్న, మండల కార్యదర్శి మారుతి, సిఐటియు మండల నాయకులు జెవి.రమణ, ఎల్.ఆదినారాయణ ఆధ్వర్యంలో రైతులు, పట్టు రైతులు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరయ్యకి వినతి పత్రం ఇచ్చారు. జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రైతుల సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్.బాషా, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సోమందేపల్లి : రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరు తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టు రైతులకు ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ కార్యదర్శి రంగప్ప, రాజగోపాల్, చాంద్‌బాషా, షీలా నారాయణస్వామి, శ్రీకాంత్, గంగరాజు, రవి, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ షాకీర్‌కి వినతి పత్రం ఇచ్చారు. రైతు సంఘం నాయకులు వివి రమణ మాట్లా డుతూ రైతుల సమస్యలు, ఇబ్బందులను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కుళ్లాయప్ప, కోకన్వీనర్ శ్రీరాములు, రైతు సంఘం నాయకులు రామిరెడ్డి, వంచిరెడ్డిపల్లి కిష్టప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాటు రైతులు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు చైతన్య గంగారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి రైతుల సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి,చిలమత్తూరు మండలం రైతు సంఘం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, విజయ్ కుమార్ ,పట్టుగూళ్ల సంఘం నాయకులు జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వీరికి మద్దతుగా సత్యసాయి జిల్లా సిఐటియు అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు. సిఐటియు హిందూపురం పట్టణ నాయకులు వి ఆర్ రాము, ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి రామకృష్ణ,ఉమర్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ తెలిపారు. స్వచ్ఛత హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమమావేశంలో ఆమె పాల్గొని స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ఆవశ్యకత, స్వచ్ఛాంధ్రప్రదేశ్ గురించి విద్యార్థినుల కు వివరించారు. పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తబుట్టలు ఏర్పాటు చేసి అందులోనే వేయాలన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. పాఠశాల ప్రాంగణం లో ఇంకుడు గుంతలు తవ్వి వర్షం నీటిని ఒడిసిపట్టాలని సూచించారు. బాలురు, బాలి కల ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని వ్యాపార భవన సముదాయాల నిర్మాణానికి అవకాశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఏవో శ్రీదేవి, ఈవోఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, ఎస్ఎంసి గౌరవాధ్యక్షులు జక్కంపూటి నాగభూషణ, ఛైర్మన్ దాడా ఖలందర్, హెచ్ఎంలు నాగరత్నమ్మ, రాజేశ్వరం, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జడ్పీ సీఈఓ ఓబుళమ్మ అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఆమె శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లా డుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులందరికీ రుచిగా, శుభ్రంగా ఉండే భోజనం అందించాలన్నారు. నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సరుకులు పంపిణీ విషయమై నిర్వాహకులతో చర్చించారు. ఆమె వెంట హెచ్ఎం నాగరత్నమ్మ, ఎంపిడిఒ కార్యా లయ ఏఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి పెద్దశ్రీనివాసులు, ఎస్ఎంసి ఛైర్మన్ నాగభూషణ ఉన్నారు.

లేపాక్షి హబ్ భూములు తిరిగి రైతులకు ఇవ్వాలి

సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్

లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు తీసుకొన్న భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని, జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విమానాశ్రయాన్ని వినియోగంలోకి తేవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హంద్రీనీవా కాలువలను ఆధునీకరించి జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించాలన్నారు. లేపాక్షి హబ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం 8 వేల ఎకరాలకు పైగా భూములను రైతుల నుంచి కారు చౌకగా కొన్నారన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి పరోక్షంగా 40 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదన్నారు. అలాంటప్పుడు ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో చేనేత పరిశ్రమ రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సత్యసాయి విమానాశ్రయాన్ని విమానాల మరమ్మతుల కేంద్రంగా మార్చుతామని చంద్రబాబు సైతం చెప్పారని గుర్తుచేశారు. ఆయా సమస్యల పరిష్కార సాధనకు సిపిఐ పోరాడుతుందన్నారు. వారితో పాటు రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శులు ఆంజనేయులు, సహదేవ, తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి -కదిరి టౌన్

పర్యాటక దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ స్మిత

పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ స్మిత అధ్యక్షతన ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రయాణం, పర్యాట కంతో వివిధ ప్రాంతాల్లోని భాషలు, కళలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, ఆచారాలు అవగతం అవుతాయన్నారు. చరిత్ర విభాగధిపతి చెన్నారెడ్డి, చరిత్ర అధ్యాపకులు డా. రవీంద్ర దేశంలోని వివిధ పర్యాటక ప్రదేశాలు, పర్యాటక రంగం గురించి వివరించారు. అంతరిక్ష పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చరిత్ర ఉర్దూ మీడియం అధ్యాపకురాలు నస్రీన్ సహీద పర్యాటక ప్రదేశాల పరిరక్షణ, ఆవశ్యకతను తెలిపారు. ఇంగ్లీష్ విభాగాధిపతి డా. హైదర్‌అలి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవడంలో పర్యాటక రంగం పాత్ర కీలకం అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప ప్రధానచార్యులు శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డా. నరసింహాచారి, అర్థశాస్త్ర విభాగధిపతి డా. శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివి తనిఖీ

రొద్దం కెజివిబిని సందర్శించిన డిఇఒ మీనాక్షి

రొద్దం : మండలంలోని ఆర్.మరవ పల్లి గ్రామంలో ఉన్న కెజిబివి ని శుక్రవారం డిఇఒ మీనాక్షి సందర్శించారు. పాఠశాలలో ప్రతి గదిని పరిశీలించి విద్యార్థుల సమస్యలు, మెనూపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చుట్టూ కలియ తిరిగి పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్‌ను పరిశీలించారు. అన్ని వసతులు సక్రమంగా ఉండడంతో ఎస్ఒను, సిబ్బందిని అభినందించారు. డిఇఒ వెంట ఎంఇఒ-2 జయభాస్కర్, ఎస్ఒ నాగరత్న, ఎంఆర్‌సి సిబ్బంది ఉన్నారు.

అమరాపురం : అలాగే అమరాపురం మండలంలోని హలుకూరు గ్రామంలో కెజిబివిని డిఇఒ మీనాక్షి, జిసిడిఒ సంపూర్ణ, అధికారులు తనిఖీ చేశారు. వారి వెంట ఎంఇఒ రాఘవయ్య, ప్రిన్సిపల్ శోభరాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

పుట్టపర్తి క్రైమ్ : పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో శుక్రవారం సిఐటియు మండల కన్వీనర్ బైపల్లి గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించిన తరువాత సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పైపల్లి గంగాధర్, అధ్యక్షులుగా గొడ్డుమర్రి నాగరాజు, ఉపాధ్యక్షులుగా సుగమంచి మల్లికార్జున, కోశాధికారిగా గురుప్రసాద్, సహాయ కార్యదర్శిగా మల్లెల అశోక్, కోశాధికారిగా జయచంద్ర, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఏ సమస్య అయినా సంఘం దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల నాయకుడు కుంటి మద్ది రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

నల్లచెరువు : గత ఆగష్టులో మండలంలోని పంతులుచెరువు గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇందుకూరుపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు నీటి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాలతో మండల పరిషత్, పంచాయతీ నిధులతో గ్రామంలో బోరు వేయించి మోటార్ బిగించడంతో నీటి సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో సర్పంచి స్వర్ణలత, ఎంపిడిఒ శకుంతల, రమణారెడ్డి, ఎంపిటిసి నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

పుట్టపర్తి రూరల్ : విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ శంకరనారాయణ తెలిపారు. మండలంలోని చిన్నపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం హెచ్ఎం ప్రభావతమ్మ సహకారంతో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, చెర్లోపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. హెచ్ఎం మాట్లాడుతూ గ్రీన్ భారత్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటడం ఓ బృహత్తర కార్యక్రమం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పుట్టపర్తి క్రైమ్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ అధికారులు తెలిపారు. శానిటరీ అధికారి శివయ్య ఆధ్వర్యంలో శానిటరీ కార్య దర్శులు వేణుగోపాల్‌రెడ్డి, ఉమాశంకర్, మోహన్ కుమార్, వందన, తదితరులు శుక్రవారం స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో మరుగుదొడ్లను మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రం చేయించారు. వారు మాట్లాడుతూ చిత్రావతి రహదారి నుంచి ఎనుములపల్లి వరకూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అందుకోసం తమ పరిధిలో ఉన్న సెక్షన్లలో చెత్తబుట్టలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ వ్యర్థాలను చెత్తబుట్టలోనే వేయాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు.

రెండు దుకాణాల్లో చోరీ

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌బిఐ సమీపంలో ఉన్న రెండు దుకాణాల్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పై కప్పు తొలగించి చోరీకి పాల్పడ్డారు. బాధితుల తెలిపిన వివరాలు.. హ్యాపీ హోమ్ నీడ్స్‌లో రూ. 5వేల నగదు రూ. 70వేల విలువ చేసే వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు అబ్దుల్ తెలిపారు. పక్కనే ఉన్న చాకోలైట్ రెడీమేడ్ షాపులో రూ. 57వేల నగదు, రూ. 25 వేల విలువ చేసే దుస్తుఉలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు మహమ్మద్ షాకీర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

'పురం' సిటిఒగా కృష్ణవేణి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సిటిఒగా కృష్ణవేణి భాధ్యతలను స్వీకరించారు. ఈమెను శుక్రవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎంపిడిఒ పోలప్ప

మండల నూతన ఎంపిడిఒగా పోలప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు ఎంపిడిఒగా పని చేస్తున్న ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపిడిఒ పోలప్ప మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం నూతన ఎంపిడిఒకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌గా ఈ.శ్రీనివాసులు

ఎమ్మెల్యే కందికుంటను కలిసిన సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు

కదిరి నూతన సబ్ రిజిస్ట్రార్‌గా ఈ.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లాలోని రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. నూతన సబ్ రిజిస్ట్రార్ ఈ.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు, రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఈసీ, నకలు, తదితర సేవలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనని కలవవచ్చని తెలిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కదిరి స్థానిక రోడ్లు భవనాలు అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కదిరి ఆర్డీవో బదిలీ

కదిరి టౌన్ : కదిరి ఆర్డీఓగా పని చేస్తున్న సన్నీవంశీకృష్ణ నెల్లూరు జిల్లాలోని కావలికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్‌లో ఎస్‌డిసిగా పని చేస్తున్న వెంకట సన్యాసిశర్మ వేదులును కదిరి ఆర్డీఓగా బదిలీ చేశారు.

గోరంట్ల తహశీల్దార్‌గా మారుతి

తహశీల్దార్ జి.మారుతి

గోరంట్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం మండల నూతన తహశీల్దార్‌గా జి.మారుతి బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తున్న మారుతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అక్బల్‌బాషా కడప జిల్లాలో ఆర్డీఓ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్ మారుతికి ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, విఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ గోరంట్ల మండలంలోని రైతులు, ప్రజలు తనను నేరుగా సంప్రదించి సమస్యలను తెలుపవచ్చు అన్నారు. వాటిని కార్యాలయ సిబ్బంది సహకారంతో వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా బాలకృష్ణానాయక్

ఏఈ బాలకష్ణానాయక్

మండల ట్రాన్స్‌కో ఏఈగా బాలకృష్ణానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసులు బదిలీపై గాండ్లపెంటకు వెళ్లారు. నల్లమాడ ఏఈగా పనిచేస్తున్న బాలకృష్ణానాయక్ ఇక్కడికి వచ్చారు.

కొత్తచెరువు డీటీగా వీరాంజనేయులు

కొత్తచెరువు : కొత్తచెరువు డిప్యూటీ తహశీల్దార్‌గా వీరాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. మడకశిరలో పని చేస్తున్న ఈయన బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.

గాండ్లపెంట ఎంపిడిఒగా వెంకటరామిరెడ్డి

ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి

గాండ్లపెంట : మండల నూతన ఎంపిడిఒగా వెంకటరామిరెడ్డి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి తహశీల్దార్‌గా స్వర్ణలత

బత్తలపల్లి : మండల నూతన తహశీల్దార్‌గా శుక్రవారం డి.స్వర్ణలత బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల ను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని కోరారు. నూతన తహశీల్దార్‌ను పలువురు నాయకులు, డీలర్లు, అధికారులు, విఆర్‌ఎలు కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యల పరిష్కారంలో సహకరించాలని ఆమె కోరారు. ప్రజలు, రైతులకు ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలవాలని సూచించారు. ఈమె చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు ముగించుకుని బదిలీపై ఇక్కడికి వచ్చారు.

తలుపుల తహశీల్దార్‌గా రెడ్డిశేఖర్

తహశీల్దార్ రెడ్డిశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

తలుపుల : మండల (ఎఫ్ఎసి) తహశీల్దార్‌గా శుక్రవారం రెడ్డి శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పూలబొకే ఇచ్చి స్వాగతం పలికి సన్మానించారు. ఈయన అమడగూరు మండల డీటీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ

ఎస్పీని కలిసిన డీఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఇటీవల పెనుకొండ నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వి.రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఇతను ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై పెనుకొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. విధులను అంకితభావంతో నిర్వహించి, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.

'ఓం శాంతి' కేంద్రం అధ్యక్షులు కరియప్ప మృతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పట్టణంలోని ఓంశాంతి ఆధ్యాత్మిక కేంద్రం అధ్యక్షులు కరియప్ప అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఓం శాంతి ఆధ్యాత్మిక కేంద్రం ప్రతినిధులు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, నగర పంచాయతీ ఉపాధ్యక్షులు వెంకటలక్ష్మమ్మ, నాగరాజు, కౌన్సిలర్ మనోహర్, టిడిపి నాయకులు సోంకుమార్, భ్రమరాంబ, రామప్ప, తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఢిల్లీ నుంచి ఇక్కడికి వలస వచ్చిన జబ్బార్‌బాషా, నూర్జహాన్ వృద్ధ దంపతులు సోమందేపల్లిలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొంతకాలంగా నూర్జహాన్‌కు ఆరోగ్యం సరిగా లేక అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రిలోనే మృతిచెందింది. ఈ విషయం తెలియడంతో జామియా మసీద్ ముతవల్లి, ఎల్ఐసి మమ్మద్, ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు మాబు చొరవతో సిపిఎం మండల కమిటీ సభ్యులు స్పందించి అనంతపురం లో ఉన్న ఆవాజ్ సంఘం జిల్లా కార్యదర్శి వలి, ఇర్ఫాన్, గౌస్, తదితరుల సహాయ సహకారాలతో అంత్యక్రియలు నిర్వహించారు.